నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్


I | హైదరాబాద్, శుక్రవారం 10 జనవరి 2025 | HYDERABAD



రాయదుర్గం-షేక్‌పేట రహదారిలో పేరుకుపోయిన వ్యర్థాలు



డబుల్ బెడ్రూం ఇండ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



గురువారం బల్దియా ఎదుట ఆందోళన చేస్తున్న కాంట్రాక్టర్లు

# బిల్లులు రాకుంటే బతికేదెట్లా..?

బల్దియాలో కాంట్రాక్టర్ల మెరుపు ధర్నా

### రూ.1500 కోట్ల బకాయిలు చెల్లించాలంటూ ఆందోళన

### ఇద్దరు కాంట్రాక్టర్ల ఆత్మహత్యాయత్నం

### ఆందోళన ఉధృతితో స్పందించిన కమిషనర్

### చర్చల అనంతరం.. వచ్చే జూన్ నాటికల్లా రూ. 400 కోట్లు ఇస్తామని హామీ



సిటీబ్యూరో: జీహెచ్ఎంసీ ఎదుట బల్దియా కాంట్రాక్టర్లు మెరుపు ధర్నాకు దిగారు. గురువారం కార్యాలయం ప్రధాన ద్వారం వద్ద కాంట్రాక్టర్లంతా బైఠాయించి రూ.1500కోట్ల పెండింగ్ బకాయిలు చెల్లించాలంటూ నిరసన ప్రదర్శన చేపట్టారు. 'వీ వాంట్ పేమెంట్స్' అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఎవరినీ కష్టపెట్టడం మా ఉద్దేశం కాదు.. బ్యాంకుల నుంచి రుణాలు తెచ్చి, చేసిన పనులకు బిల్లులు రాక ఆర్థిక సుడిగుండంలో చిక్కుకుని బతుకలేని పరిస్థితిలో ఉన్నాం' అంటూ కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇద్దరు కాంట్రాక్టర్లు ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అక్కడే ఉన్న సహచర కాంట్రాక్టర్లు ఆ ఇద్దరి ప్రయత్నాన్ని అడ్డుకున్నారు. దీంతో కొద్ది సేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఏడాది కాలంలో కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో అప్పుల బాధతో కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని బల్దియా కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రామకృష్ణారెడ్డి, సురేందర్ సింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల చదువులకు డబ్బులు లేక, వర్కర్లకు ఈపీఎఫ్, బ్యాంకులకు ఈఎంఐలు కట్టలేకపోతున్నామని, ఆర్థిక బాధలతో సడెన్ స్ట్రోక్‌లకు గురై ప్రాణాలు పోతున్న పరిస్థితులు వచ్చాయని వాపోయారు. తమ బకాయిలు చెల్లిస్తేనే పనులు జరుపుతామని, రానున్న రోజుల్లో నిరసనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

#### కమిషనర్ హామీతో..

బల్దియా కాంట్రాక్టర్ల ఆందోళనపై కమిషనర్ ఇలంబర్తి స్పందించి వారితో చర్చలు జరిపారు. కాంట్రాక్టర్లు ఎదుర్కొన్న సమస్యలపై ప్రతినిధులు కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఏడాది కాలంగా బకాయిలు చెల్లించడం లేదని, రూ.1500 కోట్ల బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. దీనిపై స్పందించిన కమిషనర్ వచ్చే జూన్ నాటికల్లా రూ. 400కోట్ల మేర బకాయిలు చెల్లిస్తామని కాంట్రాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. దీంతో కాంట్రాక్టర్లు ఆందోళన విరమించారు.



కాంట్రాక్టర్లతో మాట్లాడుతున్న బల్దియా కమిషనర్ ఇలంబర్తి

## బోజగుట్టలో నిలిచిన డబుల్ ఇండ్ల పరిశీలన

సిటీబ్యూరో: తమకు ఇండ్లు కేటాయించాలంటూ నగరవాసులు కలెక్టర్‌కు మొర పెట్టుకుంటున్నారు. గృహ నిర్మాణ శాఖకు ఇండ్ల కోసం దరఖాస్తులు వెల్లువలా వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇండ్ల కేటాయింపు ప్రక్రియ ఇప్పుడు అధికారులకు తలనొప్పిగా మారింది. హైదరాబాద్‌లో ప్రభుత్వ స్థలాలు ఉన్నప్పటికీ అవి ఖరీదైన స్థలాలు కావడంతో కొత్తగా ఇండ్లు నిర్మించడం అనేది ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంది. ఈ నేపథ్యంలో ఇప్పటికే ఇండ్లు నిర్మించి ఉన్న, పనులు ఆగిపోయి ఉన్న వాటిని అధికారులు పరిశీలిస్తున్నారు. అందులో భాగంగా గురువారం గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతమ్ ఆసిఫ్‌నగర్ మండలంలోని బోజగుట్టలో ఆగిపోయిన డబుల్ బెడ్రూం ఇండ్లను హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి పరిశీలించారు. వివేకనంద నగర్, శ్రీరాం నగర్, శివాజీ నగర్ కాలనీవాసుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. బోజగుట్టలో నివసిస్తున్న 500 మంది ప్రజలు తమ ఇండ్లు ఖాళీ చేశారని.. మిగిలిన 200 మంది ఇంకా ఖాళీ చేయలేదని కొందరు కోర్టుకు వెళ్లారని ఆయన తెలిపారు.

#### 16వేల ఇండ్లు కేటాయించాం..

కొల్లూరులో 16వేల ఇండ్లు కేటాయించామని.. అందులో 6వేల కుటుంబాలు నివసిస్తున్నాయని గృహ నిర్మాణ శాఖ మేనేజింగ్ డైరెక్టర్ వీపీ గౌతమ్ వివరించారు. బోజగుట్టలో ఆగిపోయిన డబుల్ ఇండ్ల నిర్మాణం పూర్తి చేయడానికి ప్రభుత్వానికి నివేదిక ఇస్తామన్నారు. కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ.. బోజగుట్ట డబుల్ బెడ్రూం ఇండ్ల ఇండ్ల నిర్మాణం పూర్తి చేసి అందిస్తామన్నారు. డీఆర్ఓ వెంకటచారి, ఆర్డీఓ రామకృష్ణ, ఎమ్మార్వో జ్యోతి పాల్గొన్నారు.



## పతంగులు ఎగిరేసేటప్పుడు జాగ్రత్త

సిటీబ్యూరో, జనవరి 9 (నమస్తే తెలంగాణ): పతంగుల ఎగురవేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని, అదే విధంగా ప్రశాంతతకు భంగం కల్గించకుండా నిబంధనలు పాటించాలని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ సూచించారు. ఈ మేరకు బహిరంగ ప్రదేశాలలో(పబ్లిక్ ప్లేస్) లౌడ్ స్పీకర్లు, డీజేలు పోలీసుల అనుమతి లేకుండా ఉపయోగించరాదని ఈ మేరకు 13వ ఉదయం 6 గంటల నుంచి 15వ తేదీ ఉదయం 6 గంటల వరకు నిషేధాజ్ఞలు విధిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. శబ్ద కాలుష్య నివారణకు ఆయా ఏరియాలలో శబ్దాలకు(డిజిబుల్స్) సంబంధించిన పరిమితులున్నాయని తెలిపారు. ఇండస్ట్రీయల్ ఏరియాలో(పగలు 75 డిజిబుల్స్, రాత్రి 70 డిజిబుల్స్), కమర్షియల్ ఏరియాలో (పగలు 65 డిజిబుల్స్, రాత్రి 55 డిజిబుల్స్), రెసిడెన్షియల్ ఏరియాలో (పగలు 55 డిజిబుల్స్, రాత్రి 45 డిజిబుల్స్), సైలెంట్ జోన్ (పగలు 50 డిజిబుల్స్, రాత్రి 40 డిజిబుల్స్) రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు హైకోర్టు, సుప్రీంకోర్టు ఉత్తర్వుల మేరకు లౌడ్ స్పీకర్లు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌లు ఉపయోగించరాదన్నారు.

## ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా అవగాహన కల్పించండి

సిటీబ్యూరో, జనవరి 9 (నమస్తే తెలంగాణ): వేసవిలో నీటి డిమాండ్‌ను ఎలా ఎదుర్కోవాలనే అంశంపై ఎండీ అశోక్‌రెడ్డి, ఈడీ మయాంక్ మిట్టల్ జలమండలి అధికారులతో సమీక్ష నిర్వహించారు. గత వేసవిలో అధికంగా ట్యాంకర్లు బుక్ చేసుకున్న ప్రాంతాల అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతేడాది ట్యాంక్ బుకింగ్, నీటి సరఫరా, డెలివరీ తదితర వివరాలను పరిశీలించారు. ఈ సారి నీటి డిమాండ్‌ను మరింత సమర్థంగా ఎదుర్కోవాలని ఎండీ సూచించారు. అందుకు అవసరమైన అన్ని సౌకర్యాలను సమకూరుస్తామని హామీ ఇచ్చారు. అవసరమైతే ట్యాంకర్లు, ఫిల్లింగ్ స్టేషన్లు, నీటి మోతాదు పెంచుతామని చెప్పారు. గతంలో అధికంగా ట్యాంకర్లు బుక్ చేసిన వినియోగదారులను సర్వే చేసి గుర్తించినట్లు అధికారులు వివరించారు. బోర్లు, భూగర్భ జలాలు ఎండిపోవడంతో ఈ పరిస్థితి వచ్చిందని చెప్పారు. ఈ వినియోగదారుల ఇళ్లల్లో సర్వే చేపట్టామని పేర్కొన్నారు. ఇంకుడు గుంతలు నిర్మించుకునేలా అవగాహన కల్పించాలని ఎండీ సూచించారు. ట్యాంకర్ల యజమానులతో సమావేశమయ్యారు. వేసవిలో ట్యాంకర్లపరంగా ఎలాంటి ఇబ్బందులు రాకుండా కావాల్సిన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వారి నుంచి వినతులు స్వీకరించి వాటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఈఎన్సీ, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్‌కుమార్, డైరెక్టర్ స్వామి, సీజీఎం, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## గ్రేటర్ @10.5 డిగ్రీలు

సిటీబ్యూరో, జనవరి 9 (నమస్తే తెలంగాణ): గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే క్రమంగా తక్కువకు పడిపోతుండడంతో చలిపులి వణికిస్తున్నది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు నరగంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4.4 డిగ్రీలు తగ్గి..26.6 డిగ్రీల సెల్సియస్, రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3.4 డిగ్రీలు తగ్గి..13.6 డిగ్రీల సెల్సియస్, గాలిలో తేమ 51 శాతంగా నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. కాగా, గ్రేటర్ పరిధిలోని రాజేంద్రనగర్‌లో రాత్రి ఉష్ణోగ్రతలు అత్యల్పంగా 10.5 డిగ్రీలు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.



రహదారిపై ఆందోళన చేస్తున్న ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు

## ఇదేం భోజనం..

### నాణ్యతగా లేదంటూ రోడ్డెక్కిన ఓయూ విద్యార్థులు

**ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 9:**

ఆహారం నాణ్యతగా లేదంటూ ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు రోడ్డుపై ఆందోళనకు దిగారు. మానేరు హాస్టల్ విద్యార్థులు తమ వంట గిన్నెలతో సహా ఆర్ట్స్ కళాశాల ముందు ప్రధాన రోడ్డుపై బైఠాయించి, రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ తమకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని డిమాండ్ చేశారు. హాస్టల్‌లో టాయిలెట్స్ అధ్వానంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. హాస్టల్‌లో తాగునీరు సైతం సరిగా అందుబాటులో ఉండడం లేదని మండిపడ్డారు.

రెండు రోజుల కిందట వండిన చికెన్‌లోని బొక్కలు గురువారం ఉదయం టిఫిన్‌లో దర్శనమిచ్చాయన్నారు. నాణ్యతలేని భోజనం అందిస్తూ ఓయూ అధికారులు తమ ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్నారని దుయ్యబట్టారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## నిధులిస్తేనే మెట్రోకు కొత్త కోచ్‌లు

### కొత్త కోచ్‌ల విషయంలో సర్కారు సహకారం కోరుతున్న ఎల్ అండ్ టీ

### ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో నిధుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు

### 7-10 లక్షల ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చేలా ప్రణాళికలు



సిటీబ్యూరో, జనవరి 9 (నమస్తే తెలంగాణ) : నిత్యం రద్దీగా ఉండే మెట్రోకు ప్రభుత్వం నిధులిస్తే గానీ కొత్త కోచ్‌లు వచ్చే పరిస్థితి లేదు. తాజాగా కొత్త కోచ్‌లను ఏర్పాటు చేయాలని ప్రయాణికుల వెల్లువెత్తున్న డిమాండ్ల నేపథ్యంలో... బోగీలను తీసుకొచ్చేందుకు అవసరమైన ఆర్థిక సహకారం అందించాలని ఎల్‌అండ్‌టీ సంస్థ ప్రభుత్వాన్ని కోరుతున్నది. నిత్యం ట్రాఫిక్ రద్దీ ఉండే మార్గాల్లో కొత్త కోచ్‌ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసిన నేపథ్యంలో.. ప్రస్తుతం ఉన్న ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో.. ప్రభుత్వం సహకరిస్తే కొనేందుకు సిద్ధమవుతున్నట్లు చెబుతున్నారు. ట్రిప్పుల సంఖ్యను పెంచాలన్నా.. బోగీల సంఖ్యను అప్‌గ్రేడ్ చేయడానికి ప్రభుత్వ సాయంతో సాధ్యమేనని తేల్చి చెప్పారు. దీంతో ప్రభుత్వ ఖజానా నుంచి నిధులిస్తే గానీ, కొత్త కోచ్‌లు వచ్చే అవకాశమే లేదని తెలుస్తున్నది.

#### ప్రస్తుతం 1075 ట్రిప్పులు..

ప్రస్తుతం 1075 ట్రిప్పుల ద్వారా రవాణా సదుపాయాలను అందిస్తున్న హైదరాబాద్ మెట్రో... చాలీచాలనీ బోగీలతోనే గడిచిన ఐదారేండ్లుగా నెట్టుకొస్తున్నది. పీక్ అవర్స్‌లో ప్రయాణికులతో కిక్కిరిపోతున్నా... అవే మూడు బోగీలతోనే లాక్కొస్తున్నది. కనీసం రద్దీ ఎక్కువగా ఉండే సమయంలోనైనా అదనపు బోగీలను ఏర్పాటు చేయకపోవడంతో మెట్రో ప్రయాణికులకు తోపులాట నడుమనే రాకపోకలు సాగిస్తున్నారు. నిత్యం రద్దీగా నాగోల్ – రాయదుర్గం మార్గంలోనైతే... మూడు సర్వీసులు వచ్చిన కూడా ప్లాట్‌ఫారం మీద ఉండే రద్దీ తగ్గడం లేదు.

#### కొత్త రైళ్ల కొనుగోలుకు..

మూడు బోగీలు ఉండే 10 కొత్త ట్రైన్లను కొనుగోలు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు, ఇప్పటికే సంబంధిత ఉత్పత్తి సంస్థలను గుర్తించి సంప్రదింపులు చేసినట్లుగా తెలిసింది. ప్రస్తుతం 57 హ్యుందాయ్ రోటెమ్ త్రీ కోచ్‌లతో కూడిన రైళ్ల ఉత్పత్తి తగ్గిపోవడంతో కొత్త డిజైన్ల ఎంపికపై దృష్టి పెట్టారు. అయితే ఇందుకు పుణె, నాగ్‌పూర్ మెట్రో సంస్థలను ఆశ్రయించారు. అయితే ఆయా సంస్థల వద్ద చాలినన్నీ అదనపు కోచ్‌లు లేవని తెలిసింది. ఈ క్రమంలోనే కొత్త డిజైన్లతో కూడిన ట్రైన్లను తీసుకువచ్చే ప్రతిపాదనలు ఉన్నా... ఎల్ అండ్ టీ వద్ద ఉన్న ఆర్థిక పరమైన అంశాలతో వెనుకడుగు వేస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే ప్రభుత్వం సహకరిస్తే.... 10 ట్రైన్లను తీసుకువస్తామంటున్నారు.

#### కొత్త కోచ్‌లకు టైం కావాలే...

ప్రస్తుతం ఉన్న కోచ్‌లతో నిత్యం 5 లక్షల మందిని మెట్రో సంస్థ గమ్యస్థానాలకు చేర్చుతున్నది. అయితే టైం ఫ్రీక్వెన్సీని సర్దుబాటు చేయగలిగితే... ప్రయాణికుల సంఖ్యను 7 లక్షలకు పెంచే వీలు ఉందని తెలిసింది. అయితే పది లక్షల మంది ప్రయాణించేందుకు కచ్చితంగా మరో 10 కోచ్‌లు ఉంటే గానీ సాధ్యం కాదని తెలిసింది. కొత్త మార్గాల్లో కొత్త ట్రైన్లతో పది లక్షల ప్రయాణికుల మార్క్‌ను దాటే అవకాశం ఉందన్నారు. దీంతోపాటు ప్రస్తుతం ఉన్న రైడర్ షిప్ కూడా పూర్తి సామర్థ్యానికి కంటే 10 శాతమే తక్కువ ఉందని మెట్రో వర్గాలు చెబుతున్నాయి. అయితే కొత్త కోచ్‌ల డిజైన్లు ఖరారు చేసేందుకు ఆరు నెలల పడుతుందని, మరో ఏడాదిన్నర తర్వాతే కొత్త ట్రైన్లు అందుబాటులోకి వస్తాయని.. అప్పటి వరకు పాత విధానంలోనే ప్రయాణికులకు మెరుగైన రవాణా సేవలు అందిస్తామని మెట్రో వర్గాలు చెబుతున్నాయి.